
సాక్షి
గుంటూరు

శనివారం, 14, సెప్టెంబర్, 2024



42.57 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి 33,306 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటి నిల్వ 42.57 టీఎంసీలు.



పవిత్రోత్సవాలు ప్రారంభం

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అంకురారోహణతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి.



41,775 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,880 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 41,775 బస్తాలు విక్రయించారు.

పేద విద్యార్థులకు నష్టం



మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. వాటిని సీఎం చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. పేదలకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మార్చేందుకు చేసే ప్రయత్నాన్ని విరమించుకోవాలి. ఎన్ఎంసీ అనుమతి ఇస్తే మాకు వద్దు, మేం అడ్మిషన్లు జరపలేం అంటున్న ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వమే. పీపీపీ విధానంతో పేద విద్యార్థులకు నష్టం జరుగుతుంది.

– సీహెచ్ సునీత, నీట్ రాసిన విద్యార్థిని తల్లి



తీరని అన్యాయం..



మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించటం విద్యార్థులకు అన్యాయం చేయటమే. సీట్లను అమ్ముకునేందుకే ఈ ఆలోచన చేస్తున్నారు. నీట్‌లో ర్యాంకులు సాధించిన వారి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. కేటగిరీల వారీగా సీట్లు కేటాయించటం ఒక తప్పయితే ప్రస్తుతం ప్రైవేటీకరించాలని ఆలోచన చేయటం విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేయటమే. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

– భోగాది ప్రేమిక శ్రీనాగ నిర్మల, నీట్ రాసిన విద్యార్థిని, మచిలీపట్నం



గోడ కూలడంతో రాళ్ల కింద సైకిళ్లు



దెబ్బతిన్న ఇంటి తలుపులు



తలుపులకు మరమ్మతులు చేస్తున్న కార్పెంటర్



కూలిన ఇంటి పైకప్పు, గోడలు



పాడైపోయిన ద్విచక్ర వాహనం

ఇది మహా కష్టం

- తలుపులు, కిటికీలు మరమ్మతులకు భారీగా ఖర్చులు
- సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేయడానికి రూ. 2 వేలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

వరద ప్రభావిత ప్రాంతం మహానాడులో ప్రజల ఇక్కట్లు



తడిసిపోయిన పుస్తకాలను ఆరబెడుతున్న మహిళ

తాడేపల్లి రూరల్: కృష్ణానది వరద ప్రభావం మహానాడు ప్రాంత ప్రజలకు తీరని నష్టాన్ని కలిగించింది. వరద తగ్గినప్పటికీ కష్టాలు తీరలేదు. ఇళ్లలోని పలు వస్తువులు పాడయ్యాయి. వాటి మరమ్మతుల కోసం భారీగా ఖర్చులు అవుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఇంటింటికీ నష్టం

వరదలకు మహానాడులో ఇంటింటికీ నష్టం వాటిల్లింది.గృహోపకరణాలతో పాటు చెక్క వస్తువులు, తలుపులు, సోఫాలు పూర్తిగా పాడైపోయాయి. నివాసితులంతా రోజువారీ ఉపయోగించుకునే వస్తువులతో పాటు ఇంటి తలుపులు, కిటికీలు,మంచాలు మరమ్మతులు చేయించుకుంటున్నారు. ఒక్కోదానికి రూ. 2వేల నుంచి 10 వేల వరకు ఖర్చు అవుతోంది. ఇంట్లో బాత్‌రూమ్ తలుపుకు మరమ్మతు చేయాలంటే మెటీరియల్‌తో కలిపి రూ.5 వేలు అవుతోంది. గుమ్మాలకైతే రూ. 10 వేలు దాటుతోంది. ఇక సోఫాలు ఇతర చెక్క వస్తువులను బయట పడవేస్తున్నారు. వరద తాకిడికి నీట్లు వెళ్లిన ప్రతి ఇంట్లో మరమ్మతుల నిమిత్తం రూ. 25 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖర్చు అవుతోంది. దాదాపు 2,700 ఇళ్లల్లోని సెప్టిక్ ట్యాంకుల్లోకి వరద నీరు చేరింది. వాటిని శుభ్రం చేయడానికి రూ. 2 వేల ఖర్చు అవుతోందని వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నివాసాలు కోల్పోయిన వారు వలస



వరద ఉధృతికి పూర్తిగా కూలిపోయిన ఇళ్లు

ఇళ్లు పూర్తిగా పడిపోయిన వారు, పాక్షికంగా దెబ్బతిన్న వారి పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. పూర్తిగా ఇళ్లు నష్టపోయిన 16 మంది నివాసాలను ఖాళీ చేసి బంధువుల ఇళ్లలో తల దాచుకుంటున్నారు. స్వల్పంగా దెబ్బతిన్న ఇళ్లను సైతం పూర్తిగా పడవేసి నిర్మాణం చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం చొరవ చూపించి తమ స్థలాల్లో ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలని వరద బాధితులు కోరుతున్నారు.

కనీసం సమాచారం లేదు

గత 30 సంవత్సరాల నుంచి నివాసముంటున్నా తామెప్పుడూ ఇంత వరద చూడలేదని మహానాడు ప్రజలు పేర్కొంటున్నారు. చిన్నపాటి వరద వస్తే ముందస్తుగా అధికారులు సమాచారం ఇచ్చేవారని, అలాంటిది ఇంత భారీ వరద వస్తున్నా చెప్పకపోవడం వల్లే తమకు ఇంత నష్టం వాటిల్లిందని వాపోతున్నారు.

ఖర్చులు తడిసిమోపెడు



వరద కారణంగా ఎప్పుడూ జరగని నష్టం ఈసారి జరిగింది. మా ఇల్లు కృష్ణా నదికి దగ్గరలో ఉంది. అలల తాకిడికి ఇంటి రెండు గుమ్మాలు, తలుపులతో పాటు కిటికీ రెక్కలు ఊడిపోయాయి. పనికి వచ్చేవి కొన్నే ఉన్నాయి. కొత్తవి కొనడానికి, మరమ్మతులకు రూ .10 వేలు అవుతోంది. ల తలుపులు బిగించే మేస్త్రికి రూ. 1200, హెల్పర్‌కు రూ. 1000 ఇవ్వాలి. తలుపు చెక్కలు ఇతర వస్తువులు కొనడానికి రూ. 8 వేలు అడుగుతున్నారు.

– వేంపల్లి సత్యవతి

ఇంటి గోడలు పడిపోయాయి



మా మరిదితో కలసి ఇళ్లు కట్టుకున్నాం. ఆయన ఇల్లు పూర్తిగా పడిపోయింది. దీంతో మా ఇంటిగోడలు కూడా బీటలు వారి, తలుపులు ఊడిపోయాయి. రెండు ఇళ్లు పడేసి మళ్లీ కట్టుకోవాలి. చిన్న ఇల్లు నిర్మించుకోవడానికే నానా కష్టాలు పడ్డాం. ఇప్పుడు ఇళ్లు నిర్మించుకోవాలంటే నాలుగు లక్షలు ఖర్చు అవుతుంది. మాలాంటి వారికి ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలి.

– సయ్యద్ నగీరీబాయి

అప్పు చేసి తాత్కాలిక మరమ్మతులు



మా ఇంట్లో తలుపులు, చెక్క వస్తువులు నీళ్లలో తడిసి పాడైపోయాయి. ప్రభుత్వం నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్నాం. ఇంట్లో ఉండడానికి కూడా వీల్లేకుండా ఉంది. బయట నుండి రూ. 20 వేలు అప్పు తెచ్చుకుని తాత్కాలికంగా మరమ్మతులు చేయించుకుంటున్నాం. ఇప్పటి వరకు నష్టాన్ని అంచనా వేస్తున్నారే తప్పా ఏమిస్తారనేది అధికారులు చెప్పడం లేదు. ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థంకావడం లేదు.

– విన్నకోట సౌమ్యజ్యోతి

పిల్లల పుస్తకాలు తడిసిపోయాయి



మా ఇల్లు కృష్ణానది ఒడ్డునే ఉంటుంది. ఇప్పటి వరకు ఇలాంటి వరదను ఎప్పుడూ చూడలేదు. వరద సమయంలో కనీసం మా పిల్లల పుస్తకాలు కూడా ఇంట్లోంచి బయటకు తీయలేకపోయాం. ఐదు రోజులుగా ఎండబెడుతున్నా ఒక్క పుస్తకం కూడా ఎండలేదు. ఇంట్లో వస్తువులన్నీ పాడైపోయాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– చిత్ర దుర్గ

గోడలు కూలిపోయాయి



వరద తాకిడికి ఇంటి గోడలు బీటలు వారి కూలిపోయాయి. పైన ఉన్న రేకులకు ఏమీ కాలేదు. అయితే గోడలు నిర్మించాలంటే మొత్తం పడవేయాలి. భారీగా ఖర్చు అవుతుంది. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవించే మాలాంటి వారికి కష్టం. మళ్లీ లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టాలంటే అప్పులు చేయక తప్పదు. ప్రభుత్వమే ఆదుకుని ఇళ్లకు మరమ్మతులు చేయించాలి.

– యస్‌కె జాహిదా

న్యూస్‌రీల్

వీవీఐపీలు తిరిగే రోడ్డుపై మురుగు నీరు తిష్ట



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో వీవీఐపీలు తిరుగుతున్న రహదారులపై సైతం మురుగునీరు నిల్వ ఉంటోంది. కనీసం కార్పొరేషన్ అధికారులు కూడా బయటకు పంపించే ప్రయత్నాలు కూడా చేయడం లేదు. ప్రకాశం బ్యారేజ్‌కు 500 మీటర్ల దూరంలో అమరావతి కరకట్ట మధ్యలో రోడ్డుపై భారీగా మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రతి రోజూ ఈ రహదారిలో హైకోర్టు న్యాయమూర్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు రాకపోకలు సాగిస్తారు. ఇలాంటి రహదారులను కూడా శుభ్రం చేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

రేపు ఆచార్య బేతవోలుకు జాతీయ సాహితీ పురస్కారం

గుంటూరు వెస్ట్: సంస్కృతి, అజో-విభో-కందాళం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆచార్య బేతవోలు రామబ్రహ్మంకు కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ జాతీయ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ నిర్వాహకులు సమ్రాజు బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం సమావేశ మందిరంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. వక్తలుగా పిన్నమనేని మృత్యుంజయ రావు, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, వెలువోలు నాగరాజ్యలక్ష్మి తదితర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంస్కృతాంధ్ర భాషల్లో విశేష పాండిత్యం గడించారని వివరించారు. ఉన్నత విద్యావంతుడిగా, గురువుగా పలు విశ్వవిద్యాలయాల్లో అనేక మంది శిష్యులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో విశేష కృషి చేశారని పేర్కొన్నారు. దీంతోపాటు సాహిత్యం, రచనల్లో తనదైన ముద్రతో గుర్తింపు పొందారని బాలచంద్ర తెలిపారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: గాంధీ జయంతి సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలనుసరించి ఈ నెల 17 నుంచి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పెద్దఎత్తున శుభ్రత, పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై ప్రజలకు అవగాహనతో పాటు పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నిర్దేశించిన తేదీల్లో షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాల నిర్వహణకు వివిధ శాఖల సమన్వయం ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ నెల 17న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, విద్యా సంస్థల్లోనూ ప్రతిజ్ఞ నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి రోజూ మొక్కలు పెంచడం, దోమల నివారణ, పార్కులు, డంప్ యార్డుల పరిశుభ్రత తదితర అంశాలు చేయాలని కలెక్టర్ సూచించారు. కార్మికుల సమస్యల్ని వీలైనంత వరకు పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, జీఎంసీ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఉమాదేవి, డీపీపిఓ కుసుమ శ్రీదేవి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మహీపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బదిలీల ప్రక్రియలో సంఘంపై తప్పుడు ఆరోపణలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా

గుంటూరు వెస్ట్: ఇటీవల పలు శాఖల్లో నిర్వహించిన ఉద్యోగుల బదిలీల్లో తమ సంఘంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. చాంద్ బాషా మాట్లాడుతూ తమ సంఘం ఎదుగుదలను తట్టుకోలేని కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. కేవలం ఉద్యోగుల సంక్షేమం కోసం మాత్రమే పనిచేసే తమపై బురద జల్లడం మానుకోవాలని హితవు పలికారు. తమపై నిందలు వేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని, చట్టపరంగా శిక్షపడే వరకు పోరాడతామని తెలిపారు. తమ విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, విచారిస్తామని మాటిచ్చారని చెప్పారు.

17న జాతీయ నులి పురుగుల దినోత్సవం

గుంటూరు మెడికల్: జిల్లావ్యాప్తంగా ఈనెల 17న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవంపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ముఖ్య అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని తెలిపారు. ఏడాది నుంచి రెండేళ్లలోపు పిల్లలకు అర మాత్ర నీళ్లలో కరిగించి మింగించాలని చెప్పారు. ఒకరోజు ముందే ఎంపీడీవోల ఆధ్వర్యంలో స్కూల్ టీచర్లకు పంపిణీ చేయాలని వెల్లడించారు. జ్వరం, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులతో బిళ్లలు మింగించరాదని సూచించారు. మందులు మింగిన తర్వాత కూడా రెండు గంటల పాటు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు, పిల్లలను గమనిస్తూ ఉండాలని చెప్పారు. స్కూలు పిల్లల డైరీలలో ముందుగానే రాసి నులిపురుగుల నివారణ కార్యక్రమం గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ ఏ.శ్రావణ్ బాబు, , డాక్టర్ కె.వి. సుబ్బరాజు, డాక్టర్ ఈ. అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక, పద్మజ, ప్రభాకర్‌రెడ్డి , వెంకటేశ్వర్లు, శిరీష పాల్గొన్నారు.

ధననాథుడి ధగధగలు



మంగళగిరిలో రూ.2.30 కోట్లతో అలంకరణ



గుంటూరులో రూ. 1.51 కోట్లతో అలంకరణ

మంగళగిరి /గుంటూరు ఎడ్యుకేషన్: పట్టణంలోని మెయిన్ బజార్‌లోని మార్కెట్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం, సంకా బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. ఉత్సవ నిర్వాహకులు శుక్రవారం స్వామిని రూ 2.30 కోట్ల నోట్లతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధన నాథుడు అలంకరణకు పట్టణంలో పలు బ్యాంకులు సహకరించాయి.

- వినాయకచవితి వేడుకల్లో భాగంగా గుంటూరు నగరంలోని ఆర్. అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం గణపతిని రూ. 1.51 కోట్లతో అలంకరించారు. భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నిధులు వస్తేనే అభివృద్ధి పనులు

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- 15వ ఆర్థిక సంఘ నిధుల్లో కేటాయింపులు
- ప్రొటోకాల్ ఉల్లంఘనపై జెడ్పీటీసీ సభ్యుల అసంతృప్తి
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై ఆవేదన
- టీడీపీ నాయకులే వేదికలు ఎక్కుతున్నారని విమర్శ
- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సమస్యలు ఏకరువు పెట్టిన జెడ్పీటీసీ సభ్యులు



జెడ్పీ స్థాయీ సంఘ సమావేశం నిర్వహిస్తున్న చైర్ పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వం నుంచి నిధులు వస్తేనే అభివృద్ధి పనులు చేపడతామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా చాంబర్‌లో ఆమె అధ్యక్షతన ప్రణాళిక-ఆర్థిక, పనులు, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యంపై 1,2,4,7వ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధుల్ని విడుదల చేస్తేనే అభివృద్ధి పనులు చేపట్టగలమని, ఇప్పటికే గతంలో చేసిన వాటికి బిల్లులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులకు ప్రాధాన్యత క్రమంలో పనులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనుల్ని పూర్తి చేయించాలని సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారుల్ని ఆదేశించారు.

జెడ్పీటీసీ సభ్యుల ఆవేదన

స్థాయీ సంఘ సమావేశాల్లో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యులు తమ మండలాల్లో సమస్యలను చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినాతో పాటు ప్రభుత్వ శాఖల అధికారుల ఎదుట ఏకరువు పెట్టారు. మండలాల్లో ఉత్సవ విగ్రహాలుగా మారామని, ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం ఆహ్వానానికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన చెందారు.జూన్‌లో జరిగిన పాఠశాలల ప్రారంభంలో విద్యాకానుక కిట్ల పంపిణీకి హెచ్ఎంలు, ఎంఈవోలు తమను ఆహ్వానించలేదని వాపోయారు. ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన తమకు సరైన గౌరవం దక్కడం లేదని తెలిపారు. భట్టిప్రోలు మండలంలో ఏర్పాటు చేసిన సీఎం కార్యక్రమానికి సైతం తనకు ఆహ్వానం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు వాపోయారు. దీనిపై హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఎంపీడీవోలతో పాటు ప్రభుత్వ, జెడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని డెప్యూటీ సీఈవో జె.మోహనరావుకు సూచించారు.

టీడీపీ నాయకులకు పెద్దపీట

టీడీపీ పాలన మొదలైన తరువాత తమ పరిస్థితి మరీ ఘోరంగా మారిందని పలువురు జెడ్పీటీసీ సభ్యులు ఆవేదన వెళ్లగక్కారు. తమను పక్కనపెట్టి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో స్థానిక టీడీపీ నాయకులే వేదికలపై ఎక్కుతున్నారని తెలిపారు.కృష్ణానది వరద ప్రభావానికి గురైన లంక గ్రామాల్లో వరద నీరు వెళ్లిపోయిన తరువాత కనీసం బ్లీచింగ్ చల్లే పరిస్థితి లేదని భట్టిప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు సమావేశం దృష్టికి తెచ్చారు. స్థాయీ సంఘ సమావేశాల్లో భాగంగా వ్యవసాయంపై జరిగిన 3వ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై జరిగిన 5వ సమావేశానికి పిల్లా ఉమా ప్రణతి అధ్యక్షతన వహించారు. సమావేశాల్లో ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 5,500 గరిష్ఠం : రూ. 7,400

మోడల్ ధర రూ. 6,300

క్లుప్తంగా

వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



పట్నంబజారు: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన వక్ఫ్ బోర్డు–2024 సవరణ బిల్లును పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా స్పష్టం చేశారు. మంగళదాస్‌నగర్‌లోని ఆమె కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. వక్ఫ్ సవరణ బిల్లును తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికల్లో నయవంచనతో మోసం చేసి గెలిచాక ముస్లిం మైనారిటీలకు తీరని అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. మైనారిటీల ప్రాథమిక హక్కులు, ఇస్లామిక్ చారిటీ చట్టాలు, న్యాయ సూత్రాలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. ఈ బిల్లు వక్ఫ్ నియంత్రణలో ఉన్న ఆస్తుల్లో ఎక్కువ భాగాన్ని ప్రభుత్వానికి బదిలీ చేస్తుందని, పునర్విభజన ద్వారా ఈ ఆస్తులను తగ్గిస్తుందని తెలిపారు. ఇటువంటి చట్టం రాజ్యాంగంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. ఈ బిల్లును కేంద్రం ప్రభుత్వం రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.


వరద బాధితులకు భాష్యం రూ.4 కోట్ల విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న భాష్యం హనుమంతరావు, పక్కన భాష్యం రామకృష్ణ, సాకేత్‌రామ్, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడ వరద బాధితులకు భాష్యం విద్యాసంస్థలు రూ.4 కోట్లు విరాళాన్ని అందించాయి. వెలగపూడిలోని సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు, భాష్యం రామకృష్ణ తనయుడు సాకేత్‌రామ్ చెక్కును ఆయన అందించారు. వరద బాధితులకు అండగా రూ.నాలుగు కోట్ల సహాయాన్ని అందించడంలో భాష్యం రామకృష్ణ చూపిన చొరవ అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ తన పిలుపు మేరకు స్పందించి సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులు, భాష్యం సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భాష్యం విద్యార్థులు పాల్గొన్నారు.

తులసి సీడ్స్ రూ. కోటి విరాళం



విరాళాన్ని ముఖ్యమంత్రికి అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు, తులసి యోగేష్ తదితరులు

కొరిటిపాడు: వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి తులసి సీడ్స్ రూ. కోటి భారీ విరాళాన్ని ప్రకటించింది. చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు, ఆయన కుమారుడు, తులసి సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగేష్ శుక్రవారం చెక్కును క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య రూ. 2 లక్షలను అందజేశారు. తులసి గ్రూప్ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం రూ. 5.43 లక్షలను చెక్కు రూపంలో తులసి గ్రూపు సంస్థలలో ఒకటైన 'డైహార్డ్ డైస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రొడక్షన్ మేనేజర్ పచ్చా వాసుదేవ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. 2009లో కూడా కర్నూలు వరద బాధితుల సహాయార్థం రూ. 50 లక్షల విరాళాన్ని తులసి సీడ్స్ అందజేసిందని తులసి రామచంద్ర ప్రభు తెలియజేశారు.

సిమ్స్ రూ. 10 లక్షలు విరాళం



మంత్రి నారా లోకేష్‌కు చెక్కు అందజేస్తున్న భరత్‌రెడ్డి, డాక్టర్ శివశిరీష

గుంటూరు మెడికల్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం శుక్రవారం గుంటూరు సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ భీమనాథం భరత్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ బి.శివశిరీష రూ. 10 లక్షలు విరాళం అందజేశారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో కలిసి చెక్కును అందించారు.

నేడు యథావిధిగా పని చేయనున్న పాఠశాలలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు శనివారం యథావిధిగా పని చేస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. భారీ వర్షాల కారణంగా ఇటీవల సెలవులు ప్రకటించిన కారణంగా పని దినాలను నష్టపోయిన పాఠశాలల్లో వాటిని భర్తీ చేసేందుకు రెండో శనివారం పని చేసేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని ఎంఈవోలు, డీవైఈవోలు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి సూచించారు.

కృష్ణమ్మ ఒడికి చేరిన పడవలు



తాడేపల్లి రూరల్: కృష్ణమ్మ ఒడిలోకి పడవలు చేరాయి. నది దిగువ ప్రాంతంలోని పుష్కర ఘాట్ల వద్ద పది రోజుల అనంతరం శుక్రవారం మత్స్యకారులు పడవలను తిరిగి నీటిలోకి దించారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉధృతంగా ఉండడంతో కొట్టుకుపోతాయనే భయంతో ఇప్పటి దాకా పుష్కర ఘాట్లపై భద్రపరచుకున్నారు. దిగువ ప్రాంతంలో 50 వేల క్యూసెక్కులను విడుదల చేయడంతో తిరిగి పడవలను నీటిలోకి దింపి వేట ప్రారంభించనున్నట్లు మత్స్యకారులు తెలిపారు.

లీజుకు ఆర్టీసీ స్థలాలు

పట్నంబజారు: ఆర్టీసీ పరిధిలోని పలు డిపోల్లో ఖాళీగా ఉన్న స్థలాల్ని 15 సంవత్సరాలకు లీజు పద్ధతిలో ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌ఎం ఎం. రవికాంత్ తెలిపారు. ఈ నెల 7 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని, 29 వరకు ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన వాటిని ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల్లోపు నెల్లూరులోని ఈడీ కార్యాలయంలో టెండర్ బాక్సులో వేయాలని సూచించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తెరుస్తారని తెలిపారు. పెదకాకాని పరిధిలో 2178 చదరపు గజాలు, కాకానిలోని బస్టాండ్ వద్ద 2014 చదరపు గజాలు, పెదకాకాని పరిధిలో మూడో బిట్ 1208 చదరపు గజాలు, తెనాలిలోని రామలింగేశ్వరపేటలో 7260 చదరపు గజాల రెండు బిట్లు ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈ నెల 24న ఎన్టీఆర్ బస్టాండ్ గుంటూరులో నిర్వహించే అవగాహన సదస్సుకు హాజరు కావాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాల కోసం www.apsrtc.ap.gov.in లో చూడాలని సూచించారు.

17న బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్–14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికను ఈ నెల 17న స్థానిక అరండల్‌పేటలోని మాజేటి గురవయ్య స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవనంబర్ 1, 2009 తర్వాత జన్మించిన బాలురు పోటీల్లో పాల్గొనవచ్చని ఆయన సూచించారు. ఆధార్‌తో పాటు ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, వైట్ డ్రెస్‌తో పాటు సొంత కిట్‌ను తీసుకురావాలని ఆయన తెలిపారు.

నిమ్మకు నీరెత్తింది

- రోజుల తరబడి నీటిలో తోటలు
- చెట్లు చనిపోయే ప్రమాదం
- కాపు తగ్గినా రేటు బాగుండటంతో ఊరట
- వరదలతో అసలుకే మోసమని ఆందోళన



దుండిపాలెం-యడ్లపల్లి మధ్య నిమ్మ తోటలో వరద నీరు



సంగంజాగర్లమూడి వద్ద నేటికీ నిమ్మతోటల్లో నిలిచిఉన్న వరద నీరు

తెనాలి: భారీ వర్షాలు, వరదలు నిమ్మ తోటల ఉసురు తీసేలా కనిపిస్తున్నాయి. వరద నీరు రోజుల తరబడి తోటల్లో నిలిచిన విషయం తెలిసిందే. పోటెత్తిన తుంగభద్ర డ్రెయిను పరిధిలోనైతే అసాధారణంగా నాలుగైదు అడుగుల లోతులో ముంపునకు గురయ్యాయి. ఏడాదిగా తోటల్లో కాపు బాగా తగ్గిపోయింది. అయినా మార్కెట్ ధరలు బాగుండటంతో రైతులకు ఊరటనిచ్చింది. ఇటీవలి వర్షాలకు తెగుళ్ల ఆశిస్తాయని తెలిసిందే. క్రమంగా చెట్లు చనిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన పడుతున్నారు.

తెనాలి మార్కెట్ ప్రసిద్ధి

రాష్ట్రంలో గూడూరు, ఏలూరు తర్వాత నిమ్మకాయలకు తెనాలి మార్కెట్ ప్రసిద్ధి అని తెలిసిందే. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆరు వేల ఎకరాలకు పైగా నిమ్మతోటలుంటే, అదులో అత్యధిక విస్తీర్ణం తెనాలి డివిజనులోనే ఉంది. ఇక్కడ భూజలాలు బాగుండటం, అనుకూలమైన నేల స్వభావంతో దశాబ్దాలుగా రైతులు ఇక్కడ సాగు చేస్తున్నారు. నికరమైన ఆదాయం వస్తున్న కారణంగా, మెట్ట చేలలకే పరిమితమైన సాగును, ఈ మధ్య నీటి వసతి తక్కువగా ఉండే మాగాణి భూములకూ విస్తరించారు.

ఏటా మూడు కాపులు

నిమ్మతోటలు ఏటా మే, జులై, డిసెంబరు నెలల్లో మూడు కాపులనిస్తాయి. ఒక్కో కాపు మూడేసి నెలలు ఉంటుంది. ప్రతి కాపునకు సుమారు 150–200 టిక్కీల దిగుబడి వస్తుంది. కాయ సైజు ఆధారంగా ఒక్కో టిక్కీకి 45–55 కిలోలు తూగుతాయి. కొన్నేళ్లుగా ఆదాయం బాగుండటంతో కౌలు ధరకు పెరిగాయి. ఎకరా నిమ్మతోట కౌలు రూ.లక్ష వరకు పలుకుతోంది. ఎరువులు, పురుగు మందులు, నీటితడులకు కలిపి ఎకరాకు రూ.60 వేల వరకు పెట్టుబడులు పెడుతుంటారు.

ఇటీవల తగ్గిన దిగుబడి

ఏడాదిగా నిమ్మకాయల దిగుబడి తగ్గింది. ఏటా వచ్చే దిగుబడిలో 50–60 శాతం మాత్రమే వస్తోంది. అయినప్పటికీ మార్కెట్‌లో మంచి రేటు పలుకుతోంది. 2023–24 సంవత్సరం నిమ్మ సాగు రైతులకు సంతృప్తినిచ్చింది. కిలో రూ.50–70 మధ్య అమ్మకాలు జరిగాయి. గత ఏప్రిల్‌లో రూ.68–90 వరకు కొనుగోళ్లు జరిగాయి. ప్రస్తుతం కాస్త అటూఇటుగా అదే రేటుకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఉత్తర భారతదేశంలోని నిమ్మసాగుకు ప్రముఖ కేంద్రమైన బిజాపూర్‌లో పంట పెద్దగా లేకపోవటం వల్ల మన రాష్ట్రంలో మంచి ధర లభిస్తోందని చెబుతున్నారు.

భారీ వర్షాలతో తోటలు జలమయం

ఈ నేపథ్యంలో గత జులైలో భారీ వర్షాలు నిమ్మతోటలను జలమయం చేశాయి. మళ్లీ గత నెల 31నుంచి కురిసిన భారీ వర్షాలకు వరదనీరు కలిసి నిమ్మ తోటల్లో అసాధారణమైన రీతిలో నీరు నిలిచింది. మరీ ముఖ్యంగా నియోజకవర్గంలోని సంగంజాగర్లమూడి వద్ద కొమ్మమూరు కాల్వ దిగు వనుంచి ఆరంభమయ్యే తుంగభద్ర డ్రెయిను, తన పరిధిలోని నిమ్మ తోటలను ముంచేసింది.

7–8 అడుగుల ఎత్తులో ఉండే తోటల్లో 4–6 అడుగుల లోతు వరద నీరు తిష్ట వేసింది. ఈనెల 10వ తేదీవరకు కూడా బయటకు వెళ్లనేలేదు.

కలవరపడుతున్న రైతులు

ఈ పరిణామం నిమ్మ రైతులను కలవరపెడుతోంది. తోటల్లో నీరు ఎక్కువరోజులు నిలిచివుండటం గత నాలుగు దశాబ్దాల్లో ఎన్నడూ చూడలేదని చెబుతున్నారు. తోటల్లో ఇంత లోతులో నీరు, పదిరోజుల వరకు నిలిచి ఉండటం చెట్లకు చేటుగా భావిస్తున్నారు. ఈ మధ్య నాటిన చేలల్లో మొక్కలకు నష్టం జరుగుతుంది. పెద్ద తోటల్లో కొత్త చిగురు రాకుండా తెగుళ్లు ఆశిస్తూ, క్రమంగా చెట్టు ఎండిపోతుందని అనుమానిస్తున్నారు. ఒక్కో నిమ్మ చెట్టు 15–20 ఏళ్ల వరకు కాపునిస్తుంది. చనిపోతే మళ్లీ కొత్త మొక్క నాటి, అది పెరిగి, దిగుబడి రావటానికి అయిదేళ్లు పడుతుందని తెలిసిందే.

తోటలను శాస్త్రవేత్తలు పరిశీలించాలి



ఉద్యానశాఖ అధికారులు ఎకరాకు రూ.22 వేలు పరిహారం వస్తుందని చెబుతున్నారు. పరిహారం సంగతటుంచి, ముందు తోటల్లో నేల స్వభావం ఎలాగుంది? చెట్లకు ఎటువంటి ఇబ్బందులు రావొచ్చు అనేది శాస్త్రవేత్తలు పరిశీలన చేసి చెప్పాలి. భూమి లోపల గ్యాస్ ఉత్పత్తి అయి, రసాయన మార్పులు జరుగుతాయని ఆందోళనగా ఉంది.

– కొత్త రమేష్‌బాబు, రైతు, సంగంజాగర్లమూడి

ప్రకాశం, పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రా

ప్రకాశంకు ఏడు, పశ్చిమగోదావరికి నాలుగు పాయింట్లు



సుమిత్, 100 పరుగులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్–23 అంతర్ జిల్లాల క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా ప్రకాశం, పశ్చిమగోదావరి మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోర్ మూడు వికెట్ల నష్టానికి 342 పరుగులతో శుక్రవారం మూడో రోజు బ్యాటింగ్ చేసిన ప్రకాశం జట్టు 8 వికెట్లు నష్టానికి 531 పరుగుల చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని జీవీఎస్.సుమంత్ 68 బంతుల్లో 10 ఫోర్లు, ఐదు సిక్సర్లతో 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు ఆట ముగిసే సమయానికి 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. జట్టులోని హరిష్ 89 పరుగులు సాధించాడు. అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్యం పిల్లల సంరక్షణకు చర్యలు



చినగంజాంలో సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న జిల్లా అధికారులు

చినగంజాం: కన్నబిడ్డలను పోషించలేని స్థితిలో పసికందును సైతం విక్రయించేందుకు పూనుకున్న సుబ్రహ్మణ్యం కుటుంబానికి అండగా ఉంటామని, ఆయన పిల్లల సంరక్షణకు ప్రభుత్వపరంగా తగిన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పీ పురుషోత్తమరావు అన్నారు. చినగంజాం మండలంలోని జాలమ్మ కాలనీలో నివాసముంటున్న సుబ్రహ్మణ్యం ఇంటికి జిల్లా బాలల సంరక్షణాధికారులు పీ పురుషోత్తమరావు, జీ కృష్ణ, ఇంకొల్లు ఐసీడీఎస్ సీడీపీఓ టీ ఝాన్సీ, సిబ్బంది శుక్రవారం వచ్చారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. పసికందును విక్రయించారనే విషయమై గుంటూరులో కేసు నమోదు కావడంతో గుంటూరు బాలల సంరక్షణ కేంద్రం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు విచారణ నిర్వహించారు. సుబ్రహ్మణ్యంతోపాటు ఆయన బంధువులు, ఇరుగుపొరుగు వారితో మాట్లాడారు. సుబ్రహ్మణ్యం దంపతుల ఎనిమంది మంది పిల్లలు ఎలా ఉన్నారు, వారి సంరక్షణ, స్థితిగతులు వంటి విషయాలను తెలుసుకున్నారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పీ పురుషోత్తమరావు తెలిపారు. సుబ్రహ్మణ్యం దంపతులకు ఇప్పుడు పుట్టిన పాపతో కలిపి 9 మంది సంతానం ఉన్నారు. వారిలో ఐదుగురు అమ్మాయిలు. పెద్దవారైన మగ పిల్లలు ఇద్దర్ని గొర్రెలు కాసే పనిలో కుదిర్చినట్లు గుర్తించారు. మిగిలిన ఇరువురు మగపిల్లలు తండ్రి వద్ద ఉంటున్నట్లు గుర్తించారు. గుంటూరు శిశు సంరక్షణ కేంద్రంలో పుట్టిన పాప ఉండగా, తండ్రి దగ్గర ఉన్న ఆడపిల్లల్లో పెద్దపాప మినహా ముగ్గుర్ని బాపట్ల జిల్లా శిశు సంరక్షణ కేంద్రం బాలికా సదన్‌లో చేర్పించాలని అధికారులు తండ్రికి కౌన్సెలింగ్ ఇచ్చారు. బిడ్డల తల్లి లక్ష్మి అంత్యక్రియలు పూర్తయిన తరువాత కుటుంబ సభ్యులతో చర్చించుకొని వారిని చేర్పించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఇంకొల్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే వాణిశ్రీ, మహిళా సంరక్షణాధికారి నాయుడు మీనాక్షి, ఏఎన్‌ఎం జే సువార్త, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం. హైమావతి, బీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ చేసే వరకు ఆందోళన ఆగదు

- జీహెచ్‌లో కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన
- వైద్యసేవలు నిలిపివేస్తామని హెచ్చరిక



జీజీహెచ్‌లో నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు

గుంటూరు మెడికల్: ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసే వరకు తమ నిరసనలు కొనసాగుతాయని గుంటూరు జీజీహెచ్ కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు తెలిపారు. ప్రభుత్వం ఈనెల 4న విడుదల చేసిన జీఓ నంబర్ 115ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విధులు బహిష్కరించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ప్లకార్డులు చేతబట్టుకుని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్‌ను 15 ఏళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన పోస్టుల్లో ఏఎన్‌ఎంలను సర్దుబాటు చేసేలా ప్రభుత్వం విడుదల చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే సోమవారం నుంచి అత్యవసరం మినహా సాధారణ వైద్యసేవలన్నీ బంద్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర నాయకులు స్వచ్ఛంద ప్రసాద్, పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరి, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో వృత్తిలో నిపుణత సాధించాలి

పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బాలునాయక్



బాలు నాయక్‌ను సత్కరిస్తున్న ఇంజినీర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆధునిక భారతదేశపు ఇంజినీరింగ్ నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో వృత్తిలో ఇంజినీర్లంతా నైపుణ్యం సాధించాలని పంచాయతీరాజ్ ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.బాలు నాయక్ తెలిపారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా శుక్రవారం జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెడ్పీలో పీఆర్ ఎస్‌ఈ జి. బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈఎన్‌సీ బాలునాయక్ మాట్లాడుతూ దేశంలో ఆధునిక నిర్మాణాలకు పునాది వేసిన విశ్వేశ్వరయ్య సేవలను గుర్తు చేసుకుని, ప్రస్తుత తరం ఇంజినీర్లు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని సూచించారు. విశ్రాంత ఎస్‌ఈ వీవీ మురళీకృష్ణమనాయుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను రేషనలైజేషన్ చేయాలని, వారి న్యాయమైన హక్కులను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏపీపీఆర్‌ఏ అధ్యక్షుడు కనపర్తి సంగీతరావు మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని 26ఏళ్లుగా జెడ్పీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 25 మంది పీఆర్ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రక్తదానం చేశారు. ఉద్యోగులకు బీపీ, షుగర్, టెస్టులు నిర్వహించారు. జెడ్పీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. డాక్టర్ పి. నాగ హరిత గుండె జబ్బుల నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. టెక్నికల్ సెషన్‌లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం బాలునాయక్‌ను పంచాయతీరాజ్ ఇంజినీర్లు సత్కరించారు. కార్యక్రమంలో మూడు జిల్లాల పీఆర్ ఇంజినీర్లు జింకా రమేష్, అశోక్, సుబ్బరాయుడు, డిప్లొమా ఇంజినీర్స్ ప్రధాన కార్యదర్శి రత్న ప్రసాద్, ఏపీపీఆర్‌ఈఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావు, బీడీ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎంఎస్‌ఎస్ ప్రసాద్, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వీరారెడ్డి, రజనీకాంత్, ముత్తయ్య, నరసరావుపేట జిల్లా అధ్యక్షుడు వై.వి. రమేష్, హెడ్‌క్వార్టర్స్ డీఈ పాల్, జయరాజు, అజయ్ పాల్గొన్నారు.